ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శనివారం 8 ఫిబ్రవరి 2025

న్యూస్ బాక్స్

రైస్‌మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలు సమర్పించాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ సంబంధించి ధాన్యం కేటాయింపులకు బ్యాంకు గ్యారంటీలను రైస్‌మిల్లర్లు వారం రోజులలో సమర్పించాలని అదనపు కలెక్టర్ డి వేణు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ధాన్యం కేటాయింపు, బ్యాంకు గ్యారంటీపై రైస్ మిల్లర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ సంబంధించి ధాన్యం కేటాయింపునకు 125 మంది రైస్‌మిల్లర్లలో 15 మంది మాత్రమే బ్యాంకు గ్యారంటీలు సమర్పించారని, మిగిలిన వారు వారం రోజుల్లో అందించాలని ఆదేశించారు. బ్యాంకు గ్యారంటీల జారీలో వివిధ బ్యాంకులలో ఆలస్యం అవుతుందని రైస్‌మిల్లర్లు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆలస్యం జరగకుండా చూడాలని కలెక్టర్ లీడ్ బ్యాంకు మేనేజర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల గడువులోగా ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించిన బ్యాంకు గ్యారంటీలను రైస్‌మిల్లర్లు సమర్పించాలన్నారు. డీఎస్ఓ రాజేందర్, సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, రైస్ మిల్లర్లు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమాన్‌పూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్, రొంపికుంట సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సబ్‌స్టేషన్ ఏఈ నాల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మండల కేంద్రంతో పాటు జూలపల్లి, గుండారం, నాగారం, రొంపికుంట, పేరపల్లి, పెంచి కల్‌పేట, సిద్దిపల్లె, లింగాల, రాజాపూర్ గ్రామాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- ఈ నెల 14వ తేదీతో ముగియనున్న సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలం
- ఎన్నికల ప్రక్రియ చేపట్టని ప్రభుత్వం
- పంచాయతీ, పరిషత్ ఎన్నికల తర్వాతనే
- జిల్లాలో మరో ఏడు సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు



ప్రత్యేక పాలనా.. పొడిగింపా..?

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పదవీ కాలం ఈ నెల 14వ తేదీతో ముగుస్తోంది. వారి పదవీ కాలాన్ని పొడిగిస్తారా, ప్రత్యేక అధికారుల పాలన తీసుకవస్తారా అనే చర్చ జిల్లాలో జరుగుతున్నది. ఏడాది క్రితం గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం, ఆరు మాసాల క్రితం మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ముగియగా ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించ లేదు. తాజాగా వారం రోజుల క్రితం మున్సిపాలిటీల పదవీ కాలం ముగియగా, వీట న్నింటికీ ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమిం చింది. ఈ నెల 14వ తేదీ వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పదవీ కాలం ముగియను న్నది. ఈ సంఘాలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. ఓటర్ల జాబితాల ప్రక్రియ ఇప్పటి వరకు మొదలు కాలేదు. మరో ఆరు మాసాలకు గానీ ఎన్నికలు జరిగే పరిస్థితి కనబడడం లేదు. జిల్లాలో కొత్తగా మరో ఏడు సంఘాల ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, వాటిపై ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడ లేదు.

● జిల్లాలో 20 పీఏసీఎస్‌లు..

జిల్లాలో ప్రస్తుతం 20 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. సుల్తానాబాద్ మండలంలో సుల్తానాబాద్, గర్రెపల్లి, కనుకుల, చిన్నకల్వల, సుద్దాల, ఎలిగేడు మండలం ఎలిగేడు, ధూళికట్ట, జూలపల్లి మండలం జూలపల్లి, ఓదెల మండలం పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం కాల్వశ్రీరాంపూర్, కూనారం, పెద్దపల్లి మండలం పెద్దపల్లి, అప్పన్నపేట. ధర్మారం మండలం ధర్మారం, పత్తిపాక, కమాన్‌పూర్ మండలం కమాన్‌పూర్, ముత్తారం మండలం ముత్తారం, మంథని మండలం మంథని, పాలకుర్తి మండలం కన్నాల, రామగుండం

మిగతా 8వ పేజీలో...

● ఏడు సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు..

మండలానికి రెండు సహకార సంఘాలు ఉండేలా చర్యలు తీసుకునేందుకు రీ ఆర్గనైజేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో కొత్తగా ఏడు సంఘాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపా దనలు సిద్ధం చేశారు. రామగిరి, పాలకుర్తి, అంతర్గాం, మంథని మండలం వెంకటాపూర్, గుంజపడుగు, ఓదెల మండలం కొలనూర్, మరొక సంఘం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. దానిపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత ఆయా సంఘాల పరిధిలో ఉన్న రైతులను కొత్త సంఘంలో చేర్చి కొత్తగా సభ్యత్వాలను తీసుకుని, ఓటర్ల జాబితాలు డైరెక్టర్ల వారీగా ఓటర్ల జాబితా రూపొందిం చాల్సి ఉంటుంది. ఈ తంతు పూర్తి కావడానికి నాలుగైదు నెలలైనా పడుతుంది. అలాగే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహిస్తే గానీ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో రైతులకు విస్తృత సేవలు అందించే సహకార సంఘాల పాలక వర్గాల పదవీ కాలం పొడిగిస్తారా, ప్రత్యేక అధికారులను నియమిస్తారా అనే విషయమై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం మాత్రం ప్రత్యేక అధికారుల నియామకానికే మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తున్నది.

ఈ నెల 14తో ముగియనున్న పదవీ కాలం..

- శ్రీమాల, జిల్లా సహకార శాఖాధికారి



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గాల పదవీ కాలం ఈ నెల 14వ తేదీతో ముగియనున్నది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తారా, ప్రత్యేక అధికారులను నియమిస్తారా అనే విషయమై ఏమి తెలియదు.. జిల్లాలో ఇప్పుడున్న సంఘాలకు తోడు ఏడు సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు.



పోలీసుశాఖలో ఏఆర్ విభాగం పాత్ర కీలకం



మొబిలైజేషన్ క్యాంపులో ఏఆర్ సిబ్బంది

కోల్‌సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం పాత్ర కీలకమని, శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్, ప్రధాన విభాగాలతో పాటు ఏఆర్ విభాగం సమర్థవంతంగా పనిచేస్తోందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో పునరుద్దరణ చేసిన ఆర్మ్‌డ్ అధికారుల కార్యాలయాలు, సిబ్బంది బ్యారక్ తదితర వాటిని సీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. 15రోజుల పాటు సాగిన ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమం పోలీస్ కవాతులో సీపీ గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పండుగలు, ఎన్నికల బందోబస్తు, ఊరేగింపులో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల కృషి ఎంతో ఉందన్నారు. పోలీసుశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని, బాధ్యతగా తమ విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. మొబిలైజేషన్ కార్యక్రమం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని అన్నారు. పరేడ్‌కు ఆర్ఐ అడ్మిన్ దామోదర్ ప్లాటూన్ కమాండర్‌గా వ్యవహరించారు. డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ట్రాఫిక్ ఏసీపీ జానీ నరసింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐ దామోదర్, వామన మూర్తి, మల్లేశం, సంపత్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పురస్కరించుకుని గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచల పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎం నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న బుధవారం సాయంత్రం 3గంటలకు గోదావరిఖని నుంచి బస్సు బయలు దేరుతుందని, కరీంనగర్ మీదుగా కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయం, వేలూరులోని మహాలక్ష్మి టెంపుల్ దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 20న రాత్రి అరుణాచలంకు చేరుకుంటుందని, తిరిగి 21న సాయంత్రం 3గంటలకు బయలు దేరి ఆలంపూర్ జోగులాంబ దేవస్థానం మీదుగా 22 సాయంత్రం 6గంటలకు గోదావరిఖనికి చేరుకుంటుందని వివరించారు. టికెట్ ధర పెద్దలకు గోదావరిఖని నుంచి రూ.4850, కరీంనగర్ నుంచి రూ.4500, టీజీఎస్‌ఆర్‌టీసీ వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చునని, వివరాలకు 7013504982, 7989847927 సంప్రదించాలని తెలిపారు.



ఇన్‌చార్జీల పాలనలో సింగరేణి

- డైరెక్టర్లను నియమించని యాజమాన్యం
- ఒక్కొక్కరికి ఏళ్ల తరబడి అదనపు బాధ్యతలు
- ఆరుగురు డైరెక్టర్లకు మిగిలింది ఇద్దరే...
- పదవీకాలం పొడిగింపుపైనే సీఎండీ

గోదావరిఖని, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పలు డైరెక్టర్ స్థానాలు ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతున్నాయి. సింగరేణి సంస్థ ఆర్థికంగా, సాంకేతికంగా, నిర్వహణ పరంగా చర్చించి సంస్థ భవిష్యత్‌ను నిర్ణయించే డైరెక్టర్ బోర్డులో పదేళ్లుగా డైరెక్టర్ల కొరత కొన సాగుతోంది. సింగరేణి సంస్థకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)తో పాటు ఆరుగురు డైరెక్టర్లు ఉంటారు. డైరెక్టర్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్), డైరెక్టర్(పా), డైరెక్టర్ (ఫైనాన్స్), డైరెక్టర్ (ఈఅండ్ఎం), డైరెక్టర్(ఆపరేషన్స్). వీరంతా కలిసి సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా ఉంటారు. వీరితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎనర్జీ డిపార్ట్‌మెంట్ అధికారులను డైరెక్టర్లుగా నియమిస్తారు. అయితే డైరెక్టర్ (ఫైనాన్స్)గా సింగరేణికి వచ్చిన బలరాంనాయక్ కొంతకాలం డైరెక్టర్ (పా)గా రెండు బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత ఆయన సింగరేణి సీఎండీగా సంవత్సరం క్రితం నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన పదవీకాలం పొడిగించారు. డైరెక్టర్(పీపీ)గా ఉన్న వెంకటేశ్వర్‌రెడ్డి జూలై 31న పదవీ విరమణ చేయను న్నారు. ఈ ఐదు మాసాలకు అతనికి డైరెక్టర్‌గా తిరిగి అవకాశం రాదని చెప్పుకుంటున్నారు. వారం రోజుల క్రితం వెంకటేశ్వర్‌రెడ్డి స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకుంటారనే ప్రచారం వినిపించింది. ఆంధ్రప్రదేశ్ జెన్‌కోలో అతనికి అవకాశం ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

ఇక డైరెక్టర్(ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్‌ను కొంత కాలంగా పక్కన పెట్టారు. అతని డైరెక్టర్ పదవీకాలం ముగిసింది. అతనికి ఇంకా రెండేళ్ల సర్వీసు ఉంది. ఆయన తిరిగి సీజీఎంగానే కొన సాగుతున్నారు. వారం రోజుల క్రితం సీనియర్ సీజీఎంలను కార్పొరేట్‌కు పిలిపించారు. అర్హతలను బట్టి డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమించేందుకు పిలిపించగా అనివార్య కారణాలతో సెలక్షన్‌ను వాయిదా వేశారు. ఈఅండ్ఎం డైరెక్టర్‌గా ఉన్న సత్యనారాయణరావు ప్రస్తుతం సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్)గా ఇన్‌చార్జి బాధ్యతలు చూసుకుంటున్నారు. సింగరేణి సంస్థకు పూర్తి స్థాయిలో ఐదేళ్లుగా డైరెక్టర్(పా) లేనే లేడు. బలరాం నాయక్ సీఎండీ అయిన తరువాత డైరెక్టర్(ఫైనాన్స్) కూడా లేడు. ఈ బాధ్యతలను సీఎండీనే చూసుకుంటున్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయి పదవీ బాధ్యతల్లో డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు మాత్రమే ఉన్నారు. బలరాం నాయక్, సత్యనారాయణరావు మినహా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ఒక్కరు కూడా లేరు. ఆరు డైరెక్టర్ పదవుల్లో సత్యనారాయణరావు రెండు, సీఎండీ మిగతా డైరెక్టర్ పదవులు చూసుకుంటున్నారు. డైరెక్టర్ల ఖాళీల భర్తీ విష యంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఎండీ ఉదాసీనంగా ఉంటున్నారు.

డైరెక్టర్లు లేకపోవడంతో కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయని సంఘాల నాయకులు పేర్కొంటున్నాయి. సింగరేణి విస్తరణ, విద్యుత్ రంగంపై దృష్టి కారణాలతో సీఎండీ బలరాం పని ఒత్తిడికి లోనుకావడం, ఒకే డైరెక్టర్‌తో సింగరేణి నడిపించడం శ్రేయస్కరం కాదని కార్మిక సంఘాలంటున్నాయి. ఇప్పటికైనా సింగరేణిలోని డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని కార్మిక సంఘాలంటున్నాయి. గతంలో డైరెక్టర్(పా)గా ఐఏఎస్ అధికారులను నియమించేవారు. సీఎండీ కూడా ఐఏఎస్ అధికారి ఉండేవారు. ప్రస్తుతం ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ నుంచి వచ్చిన బలరాంనాయక్‌ను సీఎండీగా నియమించి మిగిలిన డైరెక్టర్ పోస్టుల్లో ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ అధికారిని నియమించాలి. యేటా 75మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తూ రూ.30వేల కోట్ల టర్నోవర్ కలిగిన సింగరేణి సంస్థకు డైరెక్టర్లు లేకపోవడం అనుమానాలను వ్యక్తం చేస్తున్నది. థర్మల్, సోలార్, విద్యుత్ సంస్థల నిర్వహణ, ఒడిశాలోని నైని బ్లాక్‌ను ఉత్పత్తి, సంపడ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టు లాంటి ప్రాజెక్టులను ముందు పెట్టుకుని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లే లేకపోవడం చర్చగా మారింది. ఇప్పటికైనా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ స్థానాలను పూర్తి స్థాయిలో నియమించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

ముప్పై యేండ్ల కల సాకారం చేసిన ముఖ్యమంత్రి



ముఖ్యమంత్రి, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్‌సి వర్గీకరణ అనేది ముప్పై యేండ్ల కల అని, ఆ కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణతో పాటు బీసీ కుల గణన చేపట్టిన సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా ఎస్‌సీ వర్గీకరణ, బీసీ కుల గణన ముఖ్యమంత్రి చేయడం గర్వించ దగ్గ విషయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కుల గణన, ఎస్‌సీ వర్గీకరణ చేయడం చరిత్ర పుటల్లో లిఖించ దగ్గ విషమన్నారు. వారం రోజుల్లో ధర్మపురిలో కృతజ్ఞత సభ నిర్వహిస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కొడారి హన్మండ్లు, కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, కొత్త నర్సింహులు, దేవి జనార్దన్, బొల్లి స్వామి, పాలకుర్తి రాజేశం, కాంపెల్లి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతికి స్పందన



మండల పరిషత్ నుంచి ప్రారంభమైన రోడ్డు పనులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): ఐబీ చౌరస్తా నుంచి గట్టెపల్లి రోడ్డు వరకు రహదారి పనులు ప్రారంభమయ్యాయి. దెబ్బతిన్న రహదారి, వెదజల్లే దుమ్ముపై ఈ రోడ్డు పై నడిచేదెలా అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో శుక్రవారం అధికారులు రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డు పై దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో నీరు చల్లిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు, నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల నిధులు మంజూరు కాగా ఏడాది క్రితం శంకుస్థాపన చేశారు. ఆంధ్రజ్యోతి కథనం వల్లనే అధికారులు స్పందించారని పలువురు అభిప్రాయడ్డారు.

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి స్వప్న రాణి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.స్వప్నరాణి విద్యార్థులకు సూచించారు. గర్రెపల్లి గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కాలేజీని జడ్జి శుక్రవారం తనిఖీ చేశారు. పలు తరగతి గదులను పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడారు. విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన రుచితో కూడిన ఆహారాన్ని అందించాలని అన్నారు. తరగతి గదుల్లో పిల్లలకు జరుగుతున్న బోధనలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, ప్రయోగశాలలు, గ్రంథాలయం తదితర వాటిని పరిశీలించారు. జడ్జి మాట్లాడుతు పదో తరగతి పరీక్షలను ఎలాంటి భయం లేకుండా రాసి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. మాడల్ స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ కొండయ్య ఉన్నారు.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 7 (ఆం ధ్రజ్యోతి): జాతీయ నులి పురు గుల నివారణ కార్యక్రమం ఈ నెల 10న నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ నులిపురుగులు, కొంకి పురుగులు పిల్లలకు సోకడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడుతుందన్నారు. నులిపురుగులతో పిల్లలలో అలసట, నీరసం, ఏకాగ్రత లేకపోవడం, గ్రహణ శక్తి కోల్పోతారన్నారు. జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి



హర్షవర్ధన్(ఫైల్)

మంథని, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగాపురి సమీ పంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడు ప్రమాదంలో బోయిని పేటకుచెందిన ఇంటర్‌విద్యార్థి మిర్యాల హర్షవర్ధన్ (17)అనే బాలుడు మృతిచెందాడు. బోయినిపేటకు చెందిన మిర్యాల రాజు-స్వరూప దంపతుల కుమారుడు మిర్యాల హర్షవర్ధన్ ముత్తారం మండ లంలోని దర్యాపూర్ మోడల్ జూని యర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీవిభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హర్షవర్ధన్ ఏపీ 15క్యూ 4780అనే ద్విచక్ర వాహనంపై గంగాపురి నుంచి మంథ ని వైపు వస్తుండగా రైస్‌మిల్లు సమీపంలో మంథని నుంచి పెద్దపల్లి వైపువెళ్తున్న బొలెరో వాహనం హర్షవర్ధన్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. హర్షవర్ధన్ వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్‌కు తగలడంతో కిందపడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న హర్షవర్ధన్‌ను స్థానికుల సమాచారం మేరకు 108లో ప్రభుత్వఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. హర్షవర్ధన్ కుటుంబ సభ్యులంతా ఓ శుభకార్యం కోసం కరీంనగర్‌కు వెళ్లగా విషయం తెలుసుకొని హుటాహుటిన మంథనికి చేరుకున్నారు. రాజు దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా కుమారుడి మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు..

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన నెల్లి శంకరయ్య(65) కౌలు రైతు గురువారం పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులుతెలిపిన వివరాలప్రకారం.. శంకరయ్య మూడు సంవత్సరాలుగా గ్రామంలో మూడు ఎకరాల వ్యవసాయభూమి కౌలుకు తీసుకొని వరి సాగుచేస్తున్నాడు. దిగుబడిసరిగా రాక అప్పులపాలయ్యాడు. తీవ్రమన స్థాపానికి గురైన శంకరయ్య గురువారం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

చివరి ఆయకట్టు సాగు కలేనా..

- గత ప్రభుత్వంలో రూ.12.14 కోట్ల నిధులతో పనులు ప్రారంభం
- ప్రభుత్వం మారడంతో అర్ధాంతరంగా నిలిచిన పనులు
- కలగా మారిన 15 వేల ఎకరాల స్థిరీకరణ లక్ష్యం



ఆగిపోయిన కాలువ పనులు

ధర్మారం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మూడు మండలాల రైతుల పంటల సాగే లక్ష్యంగా చేపట్టిన లింక్ కాలువ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో చివరి ఆయకట్టు సాగు కలగా మారింది. రూ.12.14 కోట్లతో 15 వేల ఎకరాల స్థిరీకరణే లక్ష్యంగా లింక్ కాలువ పనులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టింది. అనంతరం ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో తలాపునే గోదావరి ఉన్న రైతుల పంటలకు నీరందని పరిస్థితి నెలకొంది.



కాలువపై నిర్మించిన బ్రిడ్జి

ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలాల రైతుల పంటపొలాలకు ప్రధాన నీటి వనరు ఎస్‌ఆర్‌ఎస్‌పి 83బీ కాలువ. ఈ కాలువ ధర్మారం మండలం మల్లాపూర్‌లో మొదలై ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలంలోని చెగ్యాం వరకు 34 కిలోమీటర్ల మేర ఉంటుంది. మల్లాపూర్ వద్ద ఉన్న డిస్ట్రిబ్యూటర్ నుంచి ఈ కెనాల్ ద్వారా 188 క్యూసెక్కుల నీరు విడుదల కావాలి. కాని 70 నుంచి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేస్తున్నారు. దీంతో యేటా ఆయా మండలాల రైతుల చివరి ఆయకట్టుకు నీరందక పొలాలు ఎండిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా మేడారం రిజర్వాయర్ నుంచి ఎస్ఆర్ ఎస్‌పి 83బీ కాలువకు లింక్ చేసి నీరందించాలని సంకల్పించింది. ఈ లింకు కాలువ ద్వారా 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ధర్మారం మండల కేంద్రం శివారులోని 10.2 కిలోమీటర్ వద్ద కలుపుతారు.

ఈ ఉద్దేశ్యంతో 2023లో రూ.12.14 కోట్ల నిధులు కేటాయించి హుటాహుటిన పనులు ప్రారంభించారు. అదే సంవత్సరం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తూమ్ నిర్మాణంతో పాటు కాలువ తవ్వకం పనులు చేశారు. ఇంతలో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడం, ఇంత వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. యేటా వెల్గటూర్ మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, చెగ్యాం, ఉండెడ గ్రామలలోని వేల ఎకరాల్లో చివరి ఆయకట్టు ఎండిపోతుంది. రాజకీయ నాయకులు పంటలను పరిశీలించడం, వారికి తాత్కాలిక ఉపశమనం కలిగేల ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటిని అందించడం నాయకులకు పరిపాటిగా మారింది. ఇప్పటికైనా నాయకులు స్పందించి నిలిచిపోయిన లింక్ కాలువ పనులు చేపట్టి మూడు మండలాల రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

మార్చిలో పనులు ప్రారంభిస్తాం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్.



గత ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరు మీద మన నీళ్లను సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్‌లకు తరలించి ఇక్కడి రైతులకు అన్యాయం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభు త్వం చేసిన తప్పిదాల వల్ల ఇప్పటి వరకు చేప ట్టిన ప్రాజెక్టుల ఖర్చు మూడింతలు పెరిగింది. అయి నప్పటికి ఈ ప్రాంత ప్రజల కోసం పెండింగ్‌లో ఉన్న ప్రతీ పనిని చేపడుతాం. మేడారం లింక్ కాలువ పనులు కూడా మార్చి నెలలో చేపట్టి వీలైనంత తొంద రగా పూర్తి చేస్తాం. మూడు మండలాల ప్రజల చివరి ఆయకట్టు వరకు నీరందించే బాధ్యత నాది.

షేక్ సాబీర్‌అలీ రిమాండ్

జమ్మికుంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సృష్టించి పట్టాభూమి కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కాటిపల్లి రాజు, అతడికి సహకరించిన షేక్ సాబీర్‌అలీని పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 464సర్వే నంబర్‌లో ఎండీ అరిఫుద్దీన్‌కు పట్టాభూమి ఉందన్నారు. కాటిపల్లి రాజు, కాటిపల్లి సంధ్య, కాటిపల్లి లక్ష్మి ఫోర్జరీ సంతకాలతో నకిలీపత్రాలు సృష్టించి సదరు భూమిలో టెంటు వేసి నిరాహార దీక్షకు దిగి యాజమానిని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అరిఫుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న ఇద్దరి అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సింగిరెడ్డిపల్లె గ్రామంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఇద్దరిని గురువారం రాత్రి గోదావరిఖని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలోని జక్కటి ఎర్రక్క ఇంటి సమీపంలో పూజలు చేస్తుండడంతో అనుమానించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలు జరుపుతున్న మంథనికి చెందిన పోగుల శ్రీనివాస్, మద్దిపాటి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద తవ్వకాలకు ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ ప్రసాద రావు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో ఆగిఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని ఓవ్యక్తి అక్కడికక్కడేమృత్యువాత పడ్డాడు. ఇల్లందకుంటకు చెందిన పెద్ది బాస్కర్(35) పెద్దపల్లిలో ఓప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే బైక్‌పై ఉద్యోగానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కోరపల్లి గ్రామంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌నుఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడేమృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, నాలుగు సంవత్సరాల కుమార్తె ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామసమీపంలో అక్రమంగా నిల్వఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన గంటఎల్లయ్య పీడీఎస్ బియ్యాన్ని సేకరించి నిలువ చేశాడనే సమాచారం మేరకు శుక్రవారం దాడిచేసినట్లు తెలిపారు. ఎల్లయ్య వద్ద 8క్వింటాళ్ల బియ్యం లభించగా నిందితుడి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రికార్డులను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

చందుర్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం భవనంలోని రికార్డులను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి తగలబెట్టారు. సంఘం సభ్యుల కథనం ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు సంఘం భవనం తలుపుల తాళం పగలగొట్టి భవనంలో ఉన్న ట్రంక్‌పెట్టెను బయటపడేసి సంఘం రిజిస్ట్రేషన్, రిజిస్టర్లు, లెటర్ ప్యాడ్‌లను తగలబెట్టారన్నారు. దుండగులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

న్యూపోరట్‌పల్లిలో విషాదం

- గజ్వేల్‌లో రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి
- కాంగ్రెస్ నేత, అతని మేనల్లుడు దుర్మరణం



లింగమూర్తి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



మెరుగు లింగమూర్తి, ముష్కే బీనేష్(ఫైల్)

జ్యోతినగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు కారు అద్దెకుతీసుకొని బయలు దేరిన వారు కొన్నిగంటల వ్యవధిలోనే విగతజీవులుగా మారారు. వివరాలు ఇలా ఉన్నాయి. న్యూపోరట్‌పల్లికి చెందిన మేరుగు లింగమూర్తి (48), అతనిసోదరుడు మహేశ్, లింగమూర్తి మేనల్లుడు ముష్కే బీనేష్ (28)లు వ్యక్తిగత పనికోసం శుక్రవారం తెల్ల వారుజామున బయలుదేరారు. రాత్రి వరకు తిరిగి వస్తామని పేర్కొన్నారు.

కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా ఉదయం 5గంటలసమయంలో గజ్వేల్ వద్ద ఆగిఉన్న లారీని ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో లింగమూర్తి, అతనిమేనల్లుడు బీనేష్ మృతిచెందగా లింగమూర్తి తమ్ముడు మహేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రణయ్‌సాగర్ స్వల్పంగా గాయపడ్డారు. మెరుగు లింగమూర్తి కాంగ్రెస్ పార్టీ ఎన్టీపీసీ పట్టణ ప్రధానకార్యదర్శిగా పని చేస్తున్నారు. రాత్రివరకు తిరిగి వస్తామని ఇంటినుంచి బయలు దేరిన కుటుంబసభ్యులు తిరిగిరాని లోకాలకు వెళ్లారని తెలిసి ఆ కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడు లింగమూర్తికి భార్య భూలక్ష్మి, కుమార్తెలు అఖిల, అమూల్య, కొడుకు అభిషేక్ ఉన్నారు. కాంగ్రెస్‌పార్టీ స్థానిక సోషల్ మీడియాసెల్ బాధ్యతలు చూస్తున్న బీనేష్‌కు తల్లి దండ్రులు చిన్నమ్మ, మల్లేష్ ఉన్నారు. బీనేష్ అవివాహితుడు.

కాంగ్రెస్ నేతల మృతికి ఎమ్మెల్యే సంతాపం..

కాంగ్రెస్ నాయకుడు లింగమూర్తి, బీనేష్ మృతి పట్ల రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, పార్టీ నాయకులు భరత్‌గౌడ్, ఎండీ ఆసీఫ్‌పాషా తదితరులు సంతాపం వ్యక్తంచేశారు. కాగా, మృతదేహాలకు పోస్ట్‌మార్టం చేసిన అనంతరం సాయంత్రం ఎన్టీపీసీ న్యూపోరట్‌పల్లికి తీసుకు వచ్చారు. శనివారం అంత్యక్రియలు జరిపేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



శ్యామ్ సుందర్ (ఫైల్)

అంతర్గాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి శివారులో ఎగువ వైపు పట్టాలపై ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి సిద్ధ శ్యామ్‌సుందర్(34) అనే యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే జీఆర్పీ రామగుండం ఇన్‌చార్జి తిరుపతి తెలిపినవివరాల ప్రకారం కుందనపల్లికి చెందిన శ్యామ్ సుందర్ ఎన్టీపీసీ యాష్‌పాండ్‌లో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్నాడు. శ్యామ్‌సుందర్ మద్యానికి అలవాటు పడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది జీవితంపై విరక్తి కలగడంతో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్యకూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తిరుపతి పేర్కొన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు జీఆర్‌పీఇన్‌చార్జి తిరుపతి తెలిపారు.

కోర్టు సమన్లు ధిక్కరించిన ఐదుగురికి జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు సమన్లు ధిక్కరించిన ఐదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి వారంరోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ జగిత్యాల జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. పెగడపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పరిసె రాయమల్లు, నామసాని రాజయ్య, నామసాని రాజ్ కుమార్, ఎనగందుల విక్రమ్, సట్ట నాంపెల్లి అనే ఐదుగురు వ్యక్తులు పలు కేసుల్లో కోర్టునుంచి సమన్లు పొంది కేసువిచారణకు గైర్హాజరవుతున్నారు. కోర్టు ఆదేశాలు లెక్కచేయకుండా తప్పించుకు తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులపై కోర్టు వారంట్ జారీ చేసింది. పెగడపెల్లి ఎస్సై రవి కిరణ్ శుక్రవారం ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. దీంతో న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించి జైలు శిక్ష విధించారు.

ఆయుర్వేద కంపెనీ యజమానికి నెల రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌అండ్‌మ్యాజిక్ రెమడీస్ యాక్ట్-1954 ధిక్కరణకింద ఓఆయుర్వేద కంపెనీ యజమానికి నెల రోజుల జైలు శిక్ష లేదా రూ.10వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి జితేందర్ శుక్రవారం తీర్పు వెలువరించారు. జగిత్యాల జిల్లా డ్రగ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఉపేందర్ 2024 సంవత్సరంలో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓకంపెనీ ఆయుర్వేదిక్‌కు సంబంధించిన పలుమాత్రల లేబుల్స్‌పై తప్పుదోవ పట్టించే ఆరోగ్య వాదనలు ఉన్నట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గుర్తించి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఆయుర్వేద మందుల కంపెనీ యజమానికి జైలు శిక్ష లేదా జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కొలుగూరి సుజిత్ (30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుజిత్ కొద్ది రోజులుగా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. కానీ ఆమె తనను ప్రేమించలేదని మనస్తాపంతో ఉంటున్నాడు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని బీఎస్‌ఆర్ గార్డెన్‌సమీపంలో పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు సూర్యకిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

నాటుబాంబు పెట్టిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ సైలెన్సర్‌లో నాటు బాంబు పెట్టిన ఓ యువకుడిని కోనరావుపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కథనం ప్రకారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన గురక ఎల్లయ్య తన ట్రాక్టర్ సైలెన్సర్‌లో గత ఏడాది డిసెంబర్ 29న రాత్రి సమయంలో నాటుబాంబు పెట్టారని ఫిర్యాదు చేశాడు. ఈసంఘటనపై విచారణచేపట్టగా వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మానుక మహిపాల్ అలియాస్ మహేష్ అనే వ్యక్తి నాటుబంబును పెట్టాడని తేలడంతో పాటు అతడి వద్ద ఒక నాటు బాంబును స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు

దండేపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపేట గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన అక్కల శేఖర్- సునీత అనే దంపతులకు తీవ్రగాయాలు అయ్యాయి. భార్యభర్తలు ఇద్దరుబైక్‌పై జన్నారం మండలం రోటిగూడ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో బైక్‌ను ట్రాక్టర్‌ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపైఉన్న సునీత తలకు తీవ్రగాయాలయ్యాయి. శేఖర్‌కు చేయి విరిగింది. గాయపడిన వీరిని స్థానికులు 108లో చికిత్సకోసం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం సునీతను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. సంఘటనస్థలానికి దండేపల్లి పోలీసులు చేరుకొని ప్రమాదానికిగల వివరాలు సేకరించారు.

జగిత్యాలలో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని హన్మకొండ డీటీసీపై ఫిర్యాదులు
- ఇంట్లోని పలు రికార్డులు స్వాధీనం



సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

జగిత్యాలక్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలో శుక్రవారం హన్మకొండ జిల్లా డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. జగిత్యాలలోని విజయపురి కాలనీకి చెందిన పుప్పాల శ్రీనివాస్ హన్మకొండ జిల్లాలోని రవాణా శాఖలో డిప్యూటిట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్ ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని ఏసీబీకి ఫిర్యాదు వచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా శ్రీనివాస్‌కు సంబంధించిన కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ అధికారులు శుక్రవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. జగిత్యాలలో శ్రీనివాస్ తండ్రి రాంచంద్రం ఇంటిలో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. రెండు గంటలకుపైగా సోదాలు నిర్వహించిన అధికారులు పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

మద్యం మత్తులో ఆర్టీసీ మహిళా కండక్టర్‌పై దౌర్జన్యం

- ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు

రామగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆర్టీసీ మహిళా కండక్టర్ పై దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి కరీంనగర్ నుంచి మంథని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సెంటినరీకాలనీలోని తెలంగాణ సెంటర్‌కు చేరుకుంది. కారులో ఆర్టీసీ బస్సును వెంబడిస్తున్న గుండారం గ్రామానికి చెందిన రాచకొండ రవి, మోతె రాజయ్యలు కారును బస్సుకు అడ్డంగా నిలిపి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగడంతో పాటు మహిళా కండక్టర్ పై దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యానికి దిగడంతో స్థానికులు అడ్డుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురి పై కేసు నమోదు చేసి కార్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యర్థుల ఆత్మీయ పలకరింపులు..

- మాజీ మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ నాయకుడు కేకే కలయికపై ఆసక్తి



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఆత్మీయంగా పలకరించుకుంటున్న కేటీఆర్, కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల/గంభీరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వారి మధ్య నిత్యం రాజకీయ విమర్శల పోరు కొనసాగుతుంది... మరోవైపు సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పరస్పరం పోటీపడుతారు... అయినా ఇద్దరూ ఆత్మీయంగా పలకరించుకోవడం అందరిలో ఆసక్తిని కలిగించింది. శుక్రవారం రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో రెడ్డి సేవా సంఘం నూతనంగా నిర్మించిన గణపతి ధ్వజ యుక్త శ్రీ మహాకాళి అమ్మవారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి బీఆర్‌ఎస్ రాష్ట్రవర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ఒకరికి ఒకరు తారసపడగా మహేందర్ అన్నా బాగున్నావా.. అంటూ కేటీఆర్ పలకరించగా, ఫైన్ ఫైన్.. అంటూ మహేందర్ రెడ్డి బదులిచ్చారు. ఇద్దరూ కాసేపు ముచ్చటించుకున్నారు. రాజకీయాలు పక్కనపెట్టి ఆత్మీయంగా పలకరించుకోవడం అక్కడున్న వారందరిలోనూ ఆసక్తిని కలిగించింది.

గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యాన్ పట్టివేత



పట్టుకున్న వ్యాన్‌తో పోలీసులు

మహదేవపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుట్కా, తంబాకు, పాన్‌మసాలా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు మండల కేంద్రం శివారులో శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై పవన్ తెలిపారు. పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా కాటారం వైపునుంచి వచ్చిన గూడ్స్‌వ్యాన్ అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో దానిని ఆపి తనిఖీచేయగా భారీగా గుట్కా, తంబాకు (అంబర్), పాన్‌మసాలా ప్యాకెట్లున్న సంచులు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. 51 సంచుల్లో ఉన్న ఈ పాకెట్ల విలువ సుమారు రూ.7.92 లక్షలు ఉంటుందని చెప్పారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన వేల్పుల సంతోష్, షేక్ పర్వేజ్‌ను అదుపులోకి తీసుకున్నామని, కొంతకాలంగా ఈ ప్యాకెట్లను కిరాణాషాపులకు సరఫరా చేస్తున్నట్లు వారు ఒప్పుకోగా కేసు నమోదు చేశామని వెల్లడించారు.

వాగులో పడి పెయింటర్ మృతి

ధర్మపురి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని తెనుగువాడ సమీపంలో గల వాగులో శుక్రవారం ప్రమాదవశాత్తు పడి ఎండీ హమీద్ (35) అనే పెయింటర్ మృతిచెందాడు. జగిత్యాలకు చెందిన హమీద్ ధర్మపురిలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు.

సాయంత్రం ఇంటి నుంచి బహిర్భూమి కోసం బయలుదేరిన హమీద్ కాలు జారి వాగులో పడి మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఉదయ్ కుమార్ పరిశీలించారు.

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా...

జిల్లెల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 'వాటర్ బెల్స్'కు శ్రీకారం..



వాటర్ బెల్ సమయంలో నీళ్లు తాగుతున్న విద్యార్థులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువుకోవాలన్న లక్ష్యంతో తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు 'వాటర్ బెల్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధతోపాటు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలో చదువుతున్న 165 మంది విద్యార్థులందరూ ఇంటినుంచి పాఠశాలకు వచ్చి తిరిగి ఇంటికి చేరే వరకు వారితో కనీసం రెండు(ఉదయం, మధ్యాహ్నం) లీటర్ల నీటిని తాగించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా రోజుకు రెండుసార్లు వాటర్ బెల్స్‌ను మోగించే ప్రక్రియను శ్రీకారం చుట్టారు. విద్యార్థులు వాటర్ బాటిల్స్ వెంట తెచ్చుకోవాలని, క్లాస్ ముగిసిన వెంటనే కొంత నీరు తాగాలనే కండిషన్ పెట్టారు. విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లతో వస్తుండడం గమనించిన ఉపాధ్యాయులు దాతల సహాయంతో స్టీల్ బాటిల్స్‌ను సమకూర్చారు. బెల్ మోగిన వెంటనే విద్యార్థులందరు కూడా పాఠశాల అవరణలోకి వచ్చి నీటిని తాగాల్సి ఉంటుంది. వీరితోపాటు ఉపాధ్యాయులు కూడా నీటిని తాగుతున్నారు.



అనుభవాల పాఠాలు..

హెచ్ఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనురాధ గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులతో పాటు ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలు వల్ల నీటిని తక్కువగా సేవించడం వల్ల కొలెస్ట్రాల్‌పెరుగుతుందని తెలుసుకున్నారు. దీంతో తాను పనిచేసే చోట విద్యార్థులకు అవసరమైనంత నీరు తాగాల్సిన ఆవశ్యకతను వివరించారు. అంతేకాకుండా విద్యార్థులు ఖచ్చితంగా నీరు సేవించేందుకు అవసరమైన వాతావరణమూ కల్పించాలని భావించారు. తాను చేస్తున్న ఈ ప్రయత్నానికి తనతో పాటు సహచర ఉపాధ్యాయ బృందం కూడా చేతులు కలపడంతో సక్సెస్ అవుతున్నానని చెప్పారు హెచ్ఎం అనురాధ.

పిల్లలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో..

జోగినపల్లి అనురాధరావు, ప్రధానోపాధ్యాయురాలు జిల్లెల్ల



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అనారోగ్యంతో పాటు చదువుపై అనాసక్తితో ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించాను. వాతావరణంలో ఏర్పడిన మార్పులవల్ల వారం రోజుల నుంచి విద్యార్థులు ప్రార్థన సమయంలో పడిపోతుండడంతో గమనించి నీళ్లు తాగడం లేదని తెలుసుకున్నాను. విద్యార్థు లతో నీళ్లు తాగించాలనే ఉద్దేశంతో 'వాటర్ బెల్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను.

పంట చేలల్లో సౌర విద్యుత్



- 'పీఎం కుసుమ్'తో
- 70శాతం రుణాలు
- జిల్లాలో 100 మెగావాట్ల ఉత్పత్తికి నిర్ణయం
- ఈనెల 22 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మహిళా సంఘాలకు ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రైతులు పంట పొలాల్లో ఆహారధాన్యాలే కాదు.. ఇక నుంచి సౌర విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సురక్షా ఊర్జ ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) పథకం అమలు ద్వారా రైతుల పంట పొలాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీరెడ్‌కో) దీని అమలుకు నోడల్ ఏజెన్సీగా ఉన్నది. ఈ సంస్థ రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. రైతులకు అదనపు ఆదాయవనరులను సమకూర్చడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన ఈ పథకం కింద రాష్ట్రంలో 4,000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు.

ఇందులో 3,000 మెగా వాట్ల విద్యుత్‌ను రైతులు, సమష్టి, వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ సంస్థలు, రైతుల సమూహం ద్వారా, 1000 మెగావాట్లను మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 400 మెగావాట్లు, వ్యక్తిగతంగా కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో వందేసి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. ఒక్కో రైతుకు రెండు మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించా లని నిర్ణయించారు. ఒక్కో జిల్లా లో రెండేసి మహిళా సంఘాలను ఎంపిక చేసి వాటి ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని మహిళా సంఘాలకు అందుకు అవసరమైన మేరకు ప్రభుత్వ స్థలాలను సమకూర్చాలని నిర్ణయించారు.

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో మహిళా సంఘాలకు యూనిట్లను కేటా యిస్తున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దత్తోజీపేట, వీణవంక మండలం గను ముకుల, పెద్దపల్లి జిల్లాలో మంథని మండలం సిరిపురం, కాల్వ శ్రీ రాంపూర్ మండల కేంద్రంలో, జగిత్యాల జిల్లాలో తాటిపల్లి, వెల్గటూర్ మండలానికి చెందిన స్తంభంపల్లిలో మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలని నిర్ణయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రాంతాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నది.



యూనిట్ల స్థాపన ఇలా..

500 కిలో వాట్స్ (0.5మెగావాట్స్) నుంచి 2000 కిలో వాట్స్ (2 మెగావాట్స్) విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతిస్తారు. అర మెగావాట్ ప్లాంట్ నెలకొల్పేందుకు 2 ఎకరాలు, ఒక మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు 4 ఎకరాలు, 1.5 మెగా వాట్ ప్లాంట్‌కు 6 ఎకరాలు, 2 మెగావాట్ ప్లాం ట్లకు 8 ఎకరాల భూమి అవసరమవుతుంది. వీటిని స్థాపించేందుకు అర మెగావాట్ ప్లాంట్‌కు సుమారుగా కోటి 5వేల రూపాయలు, ఒక మెగావాట్ ప్లాంట్‌కు 3 కోట్లు, 1.5 మెగావాట్ ప్లాంట్‌కు 4 కోట్లు, 2 మె.వా. ప్లాంట్‌కు 6 కోట్లు రూపాయలు అవసరముంటాయి.

ఇందులో 70శాతం జాతీయ బ్యాంకుల నుంచి రుణంగా సమకూరుస్తారు. లబ్ధిదారులు 30శాతం సొమ్మును భరించాల్సి ఉంటుంది. మహిళా సంఘాలు 25 నుంచి 30 లక్షల రూపాయలు చెల్లిస్తే ఏ కెపాసిటీ ప్లాంట్‌నైనా నెలకొల్పుకోవచ్చు. మిగతా సొమ్మును బ్యాంకు రుణంగా సమకూరు స్తారు. అర మెగావాట్ ప్లాంట్ ద్వారా నెలకు 72,000 యూనిట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఒక మె.వా. ప్లాంటులో 1,44,000 యూనిట్లు, 1.5 మెగావాట్ ప్లాంట్‌లో 2,16,000 యూనిట్లు, రెండు మెగావాట్ ప్లాంటుల్లో 2,82,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఉత్పత్తి అయిన విద్యుత్‌కు యూనిట్‌కు 3.13 రూపాయలు చెల్లించి డిస్కంలు కొనుగోలు చేస్తాయి. అర మెగా వాట్ ప్లాంట్ నిర్వాహకులకు నెలకు 2,25,360 రూపాయలు, 1 మెగావాట్ ఉత్పత్తిదారులకు 4,50,720 రూపాయలు, 1.50 మెగావాట్ ఉత్పత్తిదారులకు 6,76,080 రూపాయలు, 2 మెగావాట్ ఉత్పత్తిదారులకు 9,01,440 రూపాయలు ఆదాయంగా సమకూరుతాయి.

25 సంవత్సరాల పాటు ఈ సౌర విద్యుత్ ఉత్పత్తిద్వారా సమకూరే ఆదాయంపై ఎలాంటి టాక్సు విధించరు. రైతులు 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఉన్న 5 కిలో మీటర్ల పరిధిలో సౌర విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పుకొనేందుకు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. తమ పంట పొలాల నుంచి సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కోసం రైతు లు లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు ఒక కి.మీ. లైన్‌కు 6.50 లక్షలు అవసరమవుతాయి. మహి ళా సంఘాలకు మాత్రం ఈ లైను నిర్మాణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది.

దరఖాస్తుల ఆహ్వానం

రైతులు ఒక మెగావాట్ సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నెలకొల్పేందుకు చేసుకునే దరఖాస్తుకు 6వేల రూపాయలను రుసుముగా చెల్లించాలి. ఆపైన ఎంత ఉత్పత్తి పెరిగినా దరఖాస్తు రుసుము 12వేలు ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది ఫిబ్రవరి 22. ఇప్పటికే కరీంనగర్ జిల్లాలో 13.5 మెగావాట్ యూనిట్ల స్థాపనకు 11 దరఖాస్తులు, పెద్దపల్లి జిల్లాలో 14.5 మెగావాట్ యూనిట్లకు 11 దరఖాస్తులు, జగిత్యాల జిల్లాలో 5 మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల కోసం 6 దరఖాస్తులు వచ్చాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4 దరఖాస్తులు వచ్చాయి. వీరు 6 మెగావాట్స్ విద్యుత్ ఉత్పత్తికి సంసిద్ధత తెలుపుతూ దరఖాస్తు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో జిల్లాకు 100 మెగావాట్ చొప్పున 400 మెగావాట్ వరకు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు యూనిట్ల స్థాపనకు అవకాశముండగా ఇప్పటి వరకు 39 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి దరఖాస్తులు వచ్చాయి.

ఓమన్‌లో కన్నుల పండువగా రాజరాజేశ్వర స్వామి కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశమైన ఓమన్‌లో శ్రీరాజరాజేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఓమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో మస్కట్‌లోని బర్క్ సిటీలో వేదపండితులు శ్రీరాజ రాజేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ రాజ రాజేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం తొలిసారిగా మస్కట్‌లో నిర్వహించడం అభినందనీయమన్నారు. గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికులు తమ వేదనను మరి చిపోయి, దేశ సంస్కృతిని విదేశాల్లో పరి రక్షిస్తూ బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహో త్సవాలు, పండుగలు నిర్వహించడం గర్విం చదగిన విషయమన్నారు. గల్ఫ్‌లోని తెలం గాణ కార్మికుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకు వెళుతున్న ఆది శ్రీనివాస్

ఆలోచన అదిరే..

కోతులు బెదిరే..

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వనాలు వీడిన వానరాలు గ్రామాలతో పాటు పంట పొలాల్లో హంగామా చేస్తున్నాయి. పంటలను సాగు చేసిన రైతులకు కోతుల బెడద తప్పడం లేదు. పంటను కాపాడుకునేందుకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు పారిపెల్లి సంజీవరెడ్డికి ఓ ఆలోచన తట్టింది. గ్రామ శివారులో తనకున్న 2.50 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన వరి చేనును కోతుల నుంచి రక్షించుకునేందుకు కొండముచ్చు చిత్రపటాలను అక్కడక్కడా ఏర్పాటు చేశాడు. సుమారు రూ.800 వెచ్చించి రెండు ఫ్లెక్సీలను పొలంలో ఉంచడం వల్ల కోతులు బెదిరి పారిపోతున్నాయని రైతు సంజీవరెడ్డి పేర్కొంటున్నాడు. నిత్యం పొలం వద్ద కాపలా ఉండాల్సిన పని తప్పిందని పేర్కొంటున్నాడు.



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.





నామినేషన్ల ఊరేగింపులో భాగంగా తెలంగాణచౌక్‌లో అభ్యర్థుల ర్యాలీ

ర్యాలీల హోరు.. నామినేషన్ల జోరు

- పట్టభద్రుల స్థానానికి 28
- ఉపాధ్యాయ స్థానానికి 2
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అభ్యర్థులు

కరీంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు గడువు సమీపిస్తుం డడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేశారు. శుక్ర వారం ఒక్కరోజే పట్టభద్రుల స్థానానికి 28 మంది, ఉపాధ్యా య ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరు మొత్తం 30 నామినేషన్లను దాఖలు చేశారు. పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోటాపోటీగా భారీ ర్యాలీగా వచ్చిన నామినేషన్లు వేయడంతో నగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహలం కనిపించింది. పట్ట భద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షు డు బాస సత్యనారాయణరావు, మాజీ మేయర్ సునీల్‌రావుతో కలిసి మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనం తరం నామినేషన్ పత్రాలను అందజేశారు.

అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ శ్రేణులతో కలిసి మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలె క్టరేట్‌కు చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాల ను అందజేశారు. స్వతంత్ర అభ్యర్థి అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రస న్న హరికృష్ణ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలా బాద్, మెదక్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పట్ట భద్రు లు, అభిమానులతో కలిసి ఎస్సారార్ కళాశాల నుంచి డప్పు చప్పుళ్లు, ఒగ్గడోలు బృందాలు, కళాకారుల ఆటపాటలతో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని నామినేష న్ అందజేశారు. డీఎస్పీ పదవికి రాజీ నామా చేసిన మదనం గంగాధర్ కోర్టు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి పట్టభద్రు ల ఎమ్మెల్సీ స్థానానికి నామి నేషన్ వేశా రు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి పీఆర్టీ యూ నాయకుడు వంగ మహేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీగా వచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేయగా, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు తరపున నామినేషన్ వేయించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కరీంనగర్‌కు చెందిన దయ్యాల ఓంప్రకాశ్, డాక్టర్ బండారి రాజ్ కుమార్, న్యాం తాబాద్ జనార్ధన్,సంకినేని మధుసూదన్ రావు, మెక్కు హేమలత, మహ్మద్ ముస్తాక్ అలీ,మంథని మండలం పుట్ట పాకకు చెందిన సిహెచ్.పురుషోత్తం, ఇప్పటి వరకు 58 మంది నామినేషన్లు వేయగా పట్టభద్రుల స్థానానికి 49 మంది, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 9 మంది నామినేషన్లు వేశారు.

సోనియాకు గిఫ్టుగా అందిస్తాం

10న నరేంద్రుడి నవరత్నాల పేరిట అజెండా ప్రకటిస్తా

కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్య కర్తలు, నాయకులు, నా శ్రేయోభిలాషుల అండదండలతో కరీంనగర్ శాసనమండలి పట్టభద్రుల స్థానాన్ని హస్తగతం చేసుకొని, పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి బహుమతిగా అందిస్తానని ఆ పార్టీ నుంచి పట్టభద్రుల కరీంనగర్ స్థానం అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయ న కుటుంబసభ్యులతో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10న టీపీసీసీ అధ్యక్షు డు మహేందర్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మరో సెట్ వేయనున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పాలన

బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి

సుభాష్‌నగర్ : రాష్ట్రంలో గత ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగి స్తోందని బీజేపీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బాస సత్యనారాయనతో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించ కుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడు తూ, ప్రజా పాలన అని చెప్పి రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తోందని విమర్శించారు.



నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి

కామన్‌మెన్‌కు కార్పొరేట్ శక్తికి మధ్య ఎన్నిక

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

సుభాష్‌నగర్ : ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నిక కామన్‌మెన్‌కు కార్పొరేట్ శక్తికి మధ్య జరుగుతున్న ఎన్నిక అని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ ఎస్ఆర్ఆర్ కాలేజ్ నుంచి డప్పు, ఒగ్గుడోలు వాయిద్యాలు, నృత్యాలు చేసుకుంటూ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామి నేషన్ వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లా డారు. తన నామినేషన్ కార్యక్రమానికి నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి పట్టభద్రులు తరలి వచ్చారన్నారు. జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడు తూ ప్రసన్నహరికృష్ణ తన 19 సంవత్సరాలు సర్వీసు ఉన్నప్పటికీ ఉద్యోగానికి రాజీనామా చేశారని తెలిపారు.

పీఆర్టీయూటీఎస్‌తోనే సమస్యలు పరిష్కారం

పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూటీఎస్ తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి, పీఆర్టీయూటీఎస్ అధికార అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి స్థానిక పద్మనాయక కల్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకొని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామి నేషన్ వేశారు. అనంతరం ప్రెస్‌భవన్‌లో ఆయన ఉపాధ్యాయ, అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి ఉన్నారు.



నామినేషన్ అందజేస్తున్న పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

ముద్దమల్ల జ్యోతి, తహసీల్దార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వాటిపై తీసుకునే చర్యలు ఏమిటి?

తహసీల్దార్: అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నాం. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇచ్చే అవకాశం ఉందా?

తహసీల్దార్: ప్రభుత్వం పట్టాలు అమలు చేసిన భూములను గుర్తించే పనిలో ఉన్నాం. అట్టి భూములకు ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలను అమలు చేస్తాం. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయడమే మా బాధ్యత.

ఆంధ్రజ్యోతి: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన భూములు సాగులో ఉన్నాయా?

తహసీల్దార్: అప్పుడు ఇచ్చిన భూములు రెవెన్యూ రికార్డులో ఇప్పటి వరకు నమోదు కాలేదు. రికార్డు అయిన భూములకు ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తాం.

- పాలకుర్తి

కాటమయ్య రక్షణ కవచాలపై శిక్షణ



గుడిపెల్లిలో గౌడ కులస్తులకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు

పాలకుర్తి,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): గౌడ కార్మికుల ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షక కవచం కిట్ ఎంతో ఉపయోగపడుతుందని మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం గుడిపెల్లి గ్రామంలో ప్రభుత్వం అందించిన కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ, పంపిణీ కార్యక్రమం జరిగింది. రమేష్ మాట్లాడుతూ కల్లుగీసే సమయంలో ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు రక్షణ కవచంగా నిలిచే కాటమయ్య రక్షణ కవచం కిట్లను ప్రభుత్వం అందించడం శుభపరిణామమన్నారు. గౌడ కులస్తులకు ప్రభుత్వం పెన్షన్ అందిస్తుందని, ప్రమాదాలు జరిగితే పరిహారం అందిస్తుందని అన్నారు. శిక్షకులు మూల మల్లేశం, పొన్నం వెంకటేష్ గౌడ్, ఇల్లందుల అంజిబాబు గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఎక్సైజ్ ఎస్ఐ మంద శ్రీనివాస్, సిబ్బంది, గౌడ సంఘం నాయకులు శ్రీరాముల శ్రీనివాస్, శ్రీరా ముల రాజమొగిళి, స్వామి గౌడ్, భూషణవేని రాజయ్య,అడ్డకొండ బాపు, అమరగాని సత్తిగౌడ్, గంగాధరి గిరి,ఎలిచాల లింగయ్య పాల్గొన్నారు.

విద్యార్థినుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పని చేయాలి



గురుకుల హాస్టల్‌లో వసతులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణ శ్రీ

అంతర్గాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిల అభ్యున్నతికి అధ్యాపకులు, ఉపాధ్యాయులు చిత్త శుద్ధితో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ అన్నారు. శుక్రవారం రామగుండం పట్టణంలోని ఎస్సీ గురుకుల హాస్టల్‌ను సందర్శించి ఈ మేరకు మాట్లాడారు. ముందుగా హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి నైట్ హాల్ట్ నిర్వహించారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొప్పుల మాధవి, తేజస్వి, రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

మంథని, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మంథని మండలం బట్టుపల్లి గ్రామంలో గురువారం రాత్రి అడిగొప్పుల రాజమ్మ(85) అనే వృద్ధురాలు పొరపాటున డీజిల్ సేవించడంతో గ్రామస్థులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వృద్ధురాలిని స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించే క్రమంలో శ్వాస నిలిచిపోవడంతో మెడికల్ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్ సీపీఆర్ చేస్తూ ప్రత్యేక వైద్యుని సూచన మేరకు పైలట్ హబీబ్ సమన్వయంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు స్పందించిన 108 సిబ్బందిని అభినందించారు.

ప్రత్యేక పాలనా.. పొడిగింపా..?

(5వ పేజీ తరువాయి)

మండలం మేడిపల్లిలో సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 52,316 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు, బంగారం తాకట్టు, వాహన, ఇతర రుణాలు అందజేస్తున్నారు. అలాగే ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల విక్రయాలు చేపడుతున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లాలో 250కి పైగా కొనుగోలు కేంద్రాలను ప్రతీ సీజన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను నిర్వహించడం వల్ల కమీషన్ రూపేణా యేటా 12 కోట్ల రూపాయలు సహకార సంఘాలకు పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ ద్వారా ఆదాయం సమకూరుతున్నది. ఈ డబ్బులు సంఘం అభివృద్ధికి ఎంతో దోహద పడుతున్నాయి. వాణిజ్య బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇవ్వని ప్పుడు సహకార సంఘాల ద్వారానే పంట రుణాలు ఇచ్చేవాళ్లు. ఆయా సహకార సంఘాల్లో అక్రమాలు, అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరగడంతో నష్టాల పాలయ్యాయి. దీంతో జిల్లాలో కొన్ని సంఘాలు మూతపడ్డాయి. ప్రస్తుతం ఉన్న సంఘాల్లో జవాబుదారీ తనం, పారదర్శకత పెరగడంతో నిధుల దుర్వినియోగం తగ్గుముఖం పట్టింది.

ట్రస్మా రాష్ట్ర కన్వీనర్‌గా రాంచంద్రారెడ్డి



కోల్‌సిటీ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రస్మా రాష్ట్ర కన్వీనర్‌గా గోదావరిఖనికి చెందిన అరుకాల రాంచంద్రారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ ఎన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు దశా బ్దాలకు పైగా విద్యాభారతి హైస్కూల్ కరస్పాండెంట్‌గా సేవలు అందిస్తున్నారు. నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డికి, నియామకానికి సహకరించిన ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్, ముఖ్య సలహాదారు కడారి అనంతరెడ్డిలకు రాంచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాంచంద్రారెడ్డి నియామకంపై కందిరవీందర్‌రెడ్డి, పరుపాటి అంజారెడ్డి, సమ్మారావు, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటికి ఇబ్బంది కలుగకుండా సరఫరా చేయాలి

సుల్తానాబాద్ , ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీటిని సరఫరా చేయాలని కమిషనర్ మహ్మద్ నియాజ్ వాటర్ వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్టణంలో మిషన్ భగీరథ పనులను ఆయన పరిశీలించారు. మిషన్ భగీరథ కింద సుల్తానాబాద్ ఐబీలో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను, జడ్పీ బాలికల హైస్కూల్ ఆవరణలో నిర్మించిన మరో ట్యాంకును అధికారులు సందర్శించారు. క్షేత్ర స్థాయిలో ట్యాంకులను, పైప్ లైన్‌ల వ్యవస్థను పరిశీలించామన్నారు. రెండు ఓహెచ్‌ఆర్‌లలో నీరు నింపి ట్రయల్ రన్ చేయించారు. దాంతో పలు వాడల్లో లీకేజీలు రాగా వాటిని గమనించి మరమ్మతుకు ఆదేశించారు. ఏఈ సతీష్, రాజు, వినాయక్, ఉదయ్, మహేష్, దేవేందర్, రాజేశ్ ఉన్నారు.

పాడి పశువులతో రైతులకు లాభాలు

ఓదెల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సాగుతో పాటు పాడి, పశువుల పెంపకంతో రైతులకు లాభాలు ఉంటాయని పశువైద్యాధికారి మల్లేశం అన్నారు. పిట్టల ఎల్లయ్యపల్లిలో శుక్రవారం పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ మల్లేశం మాట్లాడుతూ పాడి, పశువులను పోషిస్తున్న రైతులు పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు పొందేందుకు దరఖాస్తులు చేయాలని, అందుబాటులోని పశు వైద్యశాలలో సౌకర్యాలు అంటుబాటులో ఉంటాయన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్, క్రాప్ లోన్ పొందిన పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు, పోటో అందజేయాలన్నారు. అనంతరం కృత్రిమ గర్భధారణ వల్ల జన్మించిన దూడలకు నట్టల నివారణ మందులను వేశారు. అధిక పాల ఉత్పత్తి సాధించిన మారం పోచాలు, బండి శ్రీధర్‌లను సన్మానించి పాల క్యాన్‌లను అందజేశారు. ఉమ్మడి జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ రాఘవ, గోపాల మిత్రలు మహేష్, కొండ్ర ఓదెలు, గోపతి ప్రవీణ్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ

ఓదెల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్, నారాయణ, అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐడి కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ప్రతినిధులను ఏఎంసి చైర్మన్ అభినందించారు. పాఠశాల చైర్మన్ పద్మ, ఫౌండేషన్ కార్యదర్శులు శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శి నారాయణ, ఫౌండేషన్ చైర్మన్ ప్రదీప్, భూమేష్, హెచ్‌ఎం మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి తహసీల్దార్‌గా రాజయ్య విధుల్లో చేరగా కాంగ్రెస్ నాయకులు తాడూరి శ్రీమాన్, గుజ్జుల కుమార్‌తో పాటు పలువురు కలిసి పుష్పగుచ్చం అందించి, శాలువాతో సత్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లి రూరల్ , ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు సబ్‌స్టేషన్ పరిధిలోని రాగినేడు, కనగర్తి, కాపులపల్లి, బ్రాహ్మణపల్లి, అందుగులపల్లి, కుర్మపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుండి 10.30 వరకు విద్యుత్ మరమ్మతు దృష్ట్యా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ చలపతిరావు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోడీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జేవీ చలపతిరావు అన్నారు. శుక్రవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జేవీ చలపతిరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తుందని, ప్రజల మధ్య భావోద్వేగాలనీ రెచ్చగొడుతుందన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా, రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తెలంగాణ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఐ కృష్ణ, ఎం శ్రీనివాస్, ఏ వెంకన్న, రామకృష్ణ, మేరుగు చంద్రయ్య, మల్లేష్, ఈ రాజేందర్, గుండేటి మల్లేశం, ఐ రాజేశం, పాల్గొన్నారు.

సంతాప సభ

అంతర్గాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అంతర్గాం ఎంపీడీఓగా పనిచేసి ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన మాజీ ఎంపీడీఓ ఎండీ అలీం సంతాప సభను ఎంపీపీ కార్యాలయంలో తోటి అధికారులు నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు తూము రవీందర్ పటేల్ మాట్లాడుతూ అలీం అందించిన సేవలను కొనియాడారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణు మాధవ్, కరుణాకర్, రమేష్, రాజ్ కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు కృషి



సుల్తానాబాద్‌లో న్యాయవాదులతో మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు కృషి చేస్తామని కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్‌లో పలువురు న్యాయవాదులతో సమావేశమయ్యారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతు నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకే పోటీ చేస్తున్నట్లు చెప్పారు. బార్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ అంజనేయులు, సరోత్తం రెడ్డి, నర్సయ్య ఆవుల శివ పాల్గొన్నారు

నులిపురుగులతో రక్తహీనత

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కడుపులో నులిపురుగులు ఉంటే రక్తహీనత ఏర్పడుతుందని ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, అంగన్వాడీలకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 19ఏళ్ల లోపు ఉన్న వారందరికీ ఈనెల 10న నులిపురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. డాక్టర్లు భావన, చందన, ఎంఈఓ మహేష్, పిహెచ్ ఎన్ భాగ్యలక్ష్మి, హెచ్ఈఓ శ్రీనివాస్, వినీత్ పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి ఇద్దరు మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై అధికంగా మద్యం సేవించి గోదావరిఖని పట్టణంలో ఒకే రోజు ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. జవహర్‌నగర్‌లో నివాసముండే మేధ శ్రావణ్ కుమార్(33) ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం మరణించాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. శ్రావణ్ కుమార్ మద్యానికి బానిసకావడంతో భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. శ్రావణ్ కుమార్ బుక్ స్టాల్‌లో పని చేస్తున్నాడు. తల్లి సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక ఫైవింక్లయిన్ మోరీ వద్ద శుక్రవారం బచ్చల సాంబయ్య(45) అతిగా మద్యం సేవించి మరణించాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సాంబయ్య కూలీగా పని చేస్తున్నాడు. అతని భార్య తార ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

మంథని, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నాయకుల ప్రసన్నం కోసం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు ఇనుముల సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హన్మకొండలో సీనియర్ న్యాయవాది గంధం శివపై ట్రాఫిక్ సీఐ సీతారెడ్డితో పాటు మరికొందరు పోలీసులు చేసిన దాడిని ఖండించారు. సీఐపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో న్యాయవాదుల పై ఎలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

మాస్తిన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా స్వామి

కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాస్తిన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన దంతనపల్లి స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్వామి ఎంపిక కాగా పలుసంఘాల నాయకులు మండల కేంద్రంలో శుక్రవారం సన్మానించారు. పలు సంఘాల నాయకులు అంబాల రాజేందర్, మాదాసు సతీష్, పాల శంకర్, రామగళ్ల సురేష్, శ్యామ్, భూషణవేణ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై సంబురాలు



డప్పు కొడుతున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై పెద్దపల్లిలో శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. డప్పు చప్పుళ్లతో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. వర్గీకరణ పోరాటంలో అమరులైన ఉద్యమకారులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా మాదిగలు చేస్తున్న పోరాటం ఫలించిందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ వర్గీకరణకు సంబంధించి వెంటనే గెజిట్ పబ్లిష్ చేయాలని మాదిగ సంఘాల నాయకులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాదిగ ఉపకులాలకు తొమ్మిది శాతం రిజర్వేషన్ నుండి మరో రెండు శాతం పెంచాలని కోరారు. పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, మాజీ జెడ్పిటిసి లంక సదయ్య, సుల్తానాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుక సతీష్, ఎలిగేడు మండల నాయకులు కొండయ్య, పాల రాజేశం, బొంకూరి నరసయ్య, పెరిక రాజేశం, మల్లేష్, సిరిసిల్ల శంకర్, అరికెళ్ల లచ్చయ్య, మారేపల్లి రాజు, కుమ్మరి ముఖేష్, వడ్డేపల్లి బాలయ్య, ఈర్ల ప్రవీణ్, అంబాల కొమురయ్య కళా కారులు, పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై అంబేడ్కర్ విగ్రహానికి దళితులు పూలమాలలు వేశారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కవ్వంపల్లి స్వామి, బాసంపల్లి కొండయ్య, శ్రీనివాస్, న్యాతరి శంకర్, యాసాల రాములు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి



రమాబాయిఅంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన నాయకులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతిని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లింగమల్ల శంకరయ్య, ఇంఛార్జి హెచ్‌ఎం జ్యోతి, కార్యదర్శి రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): రమాబాయిఅంబేడ్కర్ జయంతిని దళిత సంఘాల నాయకులు జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబాల రాజేందర్, దంతనపల్లి స్వామి, మాదాసు సతీష్, పాల శంకర్, రామగల్లా సురేష్ పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మాత రమాబాయి జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రమాబాయి అంబేడ్కర్‌ల త్యాగఫలమే విద్యలో బాలికల ప్రాముఖ్యత లభించిందన్నారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినీ గురుకులంను సందర్శించిన డీపీవో

ధర్మారం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మినీ గురుకుల పాఠశాలను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య సందర్శించారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న డార్మెంటరీ హల్ పనులను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణ పనులను పరిశీలించి కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీఓ రమేష్ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రవీణ్, పంచాయతీ రాజ్ ఏఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సుందిల్ల రైతులతో పోలీసుల సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రామగిరి మండల పరిధిలోని సుందిల్ల గ్రామంలో శుక్రవారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు రైతులతో సమావేశమయ్యారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, మోటార్ల చోరీలు జరుగుతున్న నేపథ్యంలో అరికట్టేందుకు పోలీసులు రైతులకు పలు సూచనలు చేశారు. శివారులో గస్తీ పెంచుతామని ఎస్సై సురేష్ తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ మహేందర్‌రెడ్డి, సిబ్బంది అప్పాసి నాగరాజు, రాజేందర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సరఫరా స్పెషల్ డ్రైవ్

ఎలిగేడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురహాన్‌మియాపేటలో తాగునీటి సరఫరా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం మంచినీటి బావులను, నీటిట్యాంకులను, చేతిపంపులను ఎంపీవో ఆరీఫ్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ సూర్యతేజతో కలిసి పరిశీలించారు. గేట్‌వాల్ సమస్యలు, పైపులైన్ లీకేజీలు ఉండకుండా చూడాలన్నారు. కార్యదర్శి మహేష్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మారం తహసీల్దార్‌గా వకీల్

ధర్మారం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ధర్మారం తహసీల్దార్‌గా ఎం.డీ.వకీల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాల్వశ్రీరాంపూర్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయనను ధర్మారం బదిలీ చేయగా బాధ్యతలు చేపట్టారు.

క్రీడల్లో పాల్గొనేలా పిల్లలను ప్రోత్సహించాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా సాధికారత కేంద్ర కో ఆర్డినేటర్ దయా అరుణ పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతు ప్రాథమిక దశ నుంచే పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి ఉండేలా ప్రోత్సహించాలన్నారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పోటీలు, మహిళల కోసం అండగా ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. శ్యామల, కృష్ణ వేణి, గెల్లు మధూకర్, బండి సంపత్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి సెలవుగా ప్రకటించాలి

మార్కండేయకాలనీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతి ఈనెల 15న ప్రభుత్వం అధికారంగా నిర్వహించి సెలవు ఇవ్వాలని బూక్యా సాయిరాం నాయక్ శుక్రవారం కలెక్టర్‌కు విన్నవించారు. జయంతి రోజున సెలవు దినం ప్రకటించాలని కోరారు.



కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ సిఫార్సు చేసిన వేతనాలు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డివిజన్ ప్రెసిడెంట్ శారద డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్జీ-2 హౌస్ కీపింగ్ కార్మికుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 30వేల మంది కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు అమలు కావడం లేదని తెలిపారు. 2013 నుంచి హైపవర్ వేతనాలు అమలు చేయాలని కమిటీ సిఫార్సు చేసిందని, కోల్‌ఇండియా పరిధిలోని బొగ్గు సంస్థలు అమలు చేస్తున్నా సింగరేణిలో అమలు చేయడం లేదని తెలిపారు. బీఆర్ఎస్ వ్యవహరించిన తీరుగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడుచుకుంటుందని తెలిపారు. జీఓ 22ను గెజిట్ చేసి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాములు, లింగయ్య, అనసూర్య, రాజమణి, సంజీవ్, నవీన్ పాల్గొన్నారు.

యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి



క్రేన్‌ను ప్రారంభిస్తున్న జీఎం సుధాకర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని ఉత్పత్తి మెరుగుపడేలా ఉద్యోగులు కృషి చేయాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఓసీపీ-1, 2లో బేస్ వర్క్‌షాప్‌లో క్రేన్‌ను జీఎం ప్రారంభించారు. ప్రాజెక్టు అవసరాల దృష్ట్యా 40 టన్నుల సామర్థ్యం గల క్రేన్‌ను 1 కోటి 73 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసినట్టు జీఎం తెలిపారు. బ్రేక్‌డౌన్‌లో ఉన్న డంపర్‌ను మరమ్మతు చేసి వినియోగంలోకి తెచ్చి సంస్థకు కోటి రూపాయల వరకు ఆదా చేసిన ఉద్యోగులను జీఎం అభినందించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాసరావు, ఏరియా ఇంజనీర్ శేఖర్‌బాబు, ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, పీఈ ఉదయ్‌భాస్కర్, మేనేజర్ ఉదయ్ హరిజన్, బేస్‌వర్క్‌షాప్ హెచ్‌ఓడీ సత్యనారాయణ, పిట్ సెక్రెటరీలు తిరుపతిరావు, సదానందంతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు. సిహెచ్. వెంకటరమణ, శేఖర్‌బాబు, రామ్మోహన్, చంద్రశేఖర్, రామారావు, ఉపేందర్, రామచంద్రరెడ్డి, రామిళ్ళ మనోహర్, పోచం పాల్గొన్నారు.

ఓసీపీ-5ను తనిఖీ చేసిన జీఎం సేఫ్టీ

గోదావరిఖని, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 జీడీకే ఓసీపీ-5ని జీఎం సేఫ్టీ (కార్పొరేట్) చింతల శ్రీనివాస్ గురువారం నైట్ షిప్టులో ఆకస్మిక తనిఖీ చేశారు. గనిలో తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. వ్యూ పాయింట్ వద్ద మ్యాప్‌లను పరిశీలించారు. డంప్ యార్డును పరిశీలించి డంప్ ఎడ్జ్‌బెర్మ్‌లు టైర్ కన్నా ఎత్తుగా ఉండాలని సూచించారు, రక్షణ పట్ల చేపట్టవలసిన ప్రణాళికల గురించి సూచనలు ఇచ్చారు. గనిలో కోల్ బెంచ్‌లు, ఫైర్ ఫైటింగ్ విధానం గురించి చర్చించారు. పని ప్రదేశాలలో తప్పని సరిగా రక్షణతో విధులు నిర్వహించాలని, ప్రతీ ఒక్క ఉద్యోగి తప్పని సరిగా రక్షణ సూత్రాలను పాటిస్తూ విధులు నిర్వహించేలా చూడాలని, రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రామగుండం రీజియన్ జీఎం(సేఫ్టీ) కేహెచ్ఎన్ గుప్తా, ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ రమేష్, షిఫ్టు ఇన్‌చార్జిలు జీ రమేష్, ఎన్ సంతోష్, అధికారులు పాల్గొన్నారు.